


“సార్”

నుదురుమీద నరాలు చివుక్కుమన్నట్టుగా తలెత్తి చూశాడు ప్రిన్సిపాల్. గౌహతి విశ్వవిద్యాలయంలో విద్యార్థులు ప్రిన్సిపాల్‌ను ‘ఘెరావో’ చేసినవార్తల్ని ఆసక్తిగా చదువుతూన్న ప్రిన్సిపాల్, లెక్చరర్ వెంకట్రావు పిలుపుకు ఉలిక్కిపడి, పేపరు అవతలపెట్టి, “కమిన్” అన్నాడు.

ప్రిన్సిపాల్‌గారి గదిలో ఆయనా, ఆయనటేబుల్, టేబుల్ ఎదురుగామూడు ప్రేం కుర్చీలు, ఆ కుర్చీల వెనక గాడ్రెజ్ బీరువా, ఆ బీరువాపక్క గోడమీద గడియారమూ తప్ప – మరో మానవమాత్రుడెవరూలేరు. అతి వినయానికి చిహ్నంగా అడుగులో అడుగువేసుకొంటూ, తప్పుచేసిన విద్యార్థిలా ప్రిన్సిపాల్‌గారి ఎదుట చేతులు కట్టుకొని నిలబడ్డాడు వెంకట్రావు.

“ప్లీజ్, సిట్ డవున్” అన్నాడు ప్రిన్సిపాల్ కుడిచేత్తో కళ్ళజోడు తీస్తూ.

మొహమాటంతో కూడుకున్న చిరునవ్వు నవ్వాడు వెంకట్రావు. అంతకుమించి, దర్జాగా కుర్చీలో కూర్చోవడానికి జంకాడు.

“కూర్చోండి, నిలబడ్డారేం?” అన్నాడు ప్రిన్సిపాల్ మళ్ళీ.

“మీరు క్షమించాలి సార్!” అన్నాడు వెంకట్రావు తప్పుచేసినవాని అర్థింపుతో.

ప్రిన్సిపాల్‌గారు నిశ్శబ్దంగా ఆశ్చర్యపడ్డాడు. కుర్రకారు లెక్చరర్లలో వెంకట్రావు బుద్ధిమంతుడు; వినయ విధేయతలు గలవాడు. మంచివాడు. పాఠాలు చెప్పడంలో పేరు ప్రతిష్ఠలు తెచ్చుకొన్నవాడు. విద్యుక్తధర్మంలో అడుగుజారని వ్యక్తి. రోజూ ఠంచన్‌గా పదిన్నరకు కాలేజీకి వచ్చి, పనిఉన్నా లేకపోయినా, సాయంత్రం నాలుగు గంటలవరకూ కాలేజీలోనేఉంటాడు; వయస్సుకుమించిన ఉన్నతాశయాలు గలవాడు. టెన్నిస్‌లో అందెవేసిన చేయి. ప్లాట్‌ఫారం ఎక్కి ఝంఝూమారుతంగా మాట్లాడగలవాడు. ఆరడుగుల అందమైన విగ్రహం. ఎదుటివారిని ఇట్టే ఆకర్షించుకోగల ప్లీజింగు పర్సనాలిటీ ఉన్నవ్యక్తి. అట్లాంటివాడు– ఇట్లా క్షమాపణతో ఉపోద్ఘాతం మొదలెట్టాడేమిటి? అనుకొంటూ ప్రిన్సిపాల్ తన ఆశ్చర్యాన్ని కనుబొమల ద్వారా స్పష్టంగా తెలియజేశాడు.

“ముందు మీరు కూర్చోండి! క్షమాపణ తర్వాత!'' అన్నాడు ప్రిన్సిపాల్ కొంచెం విసుగ్గా.

వెంటనే కుర్చీలో కూర్చున్నాడు వెంకట్రావు చప్పుడు చేయకుండా.

“ఇప్పుడు చెప్పండి! మీరు చేసిన తప్పేమిటో:నేనెందుకు క్షమించాలో..!” అన్నాడు ప్రిన్సిపాల్ వినడానికి సిద్ధంగా ఉన్న ఫోజుపెట్టి.

ప్రిన్సిపాల్ గదికున్న స్ప్రింగ్‌డోర్‌కేసి ఓసారి చూశాడు వెంకట్రావు– ఎవ్వరూ రావడంలేదుగా అన్నట్టు.

“ఇప్పుడొచ్చే విజిటర్స్ ఎవ్వరూ లేరు. మీ మనస్సులో ఉన్నది నిర్మొహమాటంగా చెప్పుకోవచ్చు. మీలాంటి బుద్ధిమంతుల కొచ్చిన ఇబ్బందులను తీర్చడంలో నాకెంతో సంతృప్తి ఉంది. యు ఆర్ వెరీ నైస్ ఛాప్!” అన్నాడు ప్రిన్సిపాల్.

ప్రిన్సిపాల్‌గారి మాటలకు వెంకట్రావులో ఉత్సాహం ఉరకలువేసింది తాను ప్రిన్సిపాల్‌గారిలో ఊహించిన మంచితనానికి ఆయనమాటలు ప్రత్యక్షనిదర్శనాలుగా తోచినయ్. తన సమస్యకు సులభమైన పరిష్కారమే లభిస్తుందని

మనస్సులోనే మురిసిపోయాడు వెంకట్రావు.

"ఒక తప్పుపని చేశాను సార్." ఉపోద్ఘాతంగా ప్రారంభించాడు వెంకట్రావు.

"నువ్వు తప్పుచేసినా, ఒప్పుచేసినా నా అభిమానమూ, అండదండలూ నీకెప్పుడూ ఉంటాయి. నిన్ను చూడగానే, నాకు వాత్సల్యం పొంగుకొస్తోందోయ్! పూర్వజన్మ వాసన ఏమైనా ఉందేమో మన ఇరువురి మధ్య. ఇంతకూ నువ్వు చేసిన తప్పేమిటి? వివరంగా చెప్పు. భయమూ, బిడియమూ అక్కర్లేదు!" అన్నాడు ప్రిన్సిపాల్ ఎదుటివ్యక్తిలో ధైర్యాన్ని జొప్పిస్తూ.

"ఒకమ్మాయిని ప్రేమించానుసార్!"

"అమ్మాయినా?"

"అవును సార్"

"మనకాలేజీలోచదివే అమ్మాయినే?"

"ఉహూఁ; లేదు సార్! ఆమె బి.కాం ప్యాసై, ఒక బాంకులో ఉద్యోగం చేస్తూన్నది."

"ఐసీ! అలాచెప్పు. అయితే యిబ్బందేమీలేదు. మన కాలేజీలో చదివే అమ్మాయి కాదుగాబట్టి, నో ప్రోబ్లమ్! సొల్యూషన్ ఈజీయే! కథంతా టూకీగా చెప్పు. ఇందులో నా ప్రమేయమూ, సహాయమూ ఏమిటో!"

"మీరు ఇంటర్ ఫియరై, హెల్ప్‌చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందిసార్! అందుకే మిమ్మల్ని అర్థిస్తున్నాను. మీకు తెలుసుగా! - నేను మొదట్నుంచీ అభాగ్యుణ్ణి. నేను పుట్టిన ఆరేళ్ళలోనే తల్లిదండ్రుల్ని కోల్పోయాను. అప్పటికి మా నాన్న ఇచ్చిన ఆస్తి అక్షరాభ్యాసం చేయించడమే. అప్పట్నుంచీ ఒకపక్కన అడుక్కుతింటూ, మరోపక్కన చదువు కొనసాగించాను. జీవితంలో ఎన్నో కష్టాలుపడి..."

"అదంతా గతచరిత్రకదా! ప్రస్తుత కర్తవ్యాన్ని గురించి చెప్పు. ఒకప్పుడు గతుకులదారిలో వెలుగుకోసం అన్వేషణ జరుపుతూ యాత్ర చేసినవారికే - పూలబాట అందుబాటులోకి వచ్చి, జీవితం వెన్నెలమయమవుతుంది. నీ ప్రేమ వ్యవహారం చెప్పు! ఇప్పుడది ఏ స్టేజిలో ఉంది?"

"మేం రోజూ ఉదయం తొమ్మిదిన్నరా, పదిగంటలమధ్య హిమయత్ నగర్ బస్సుస్టాప్‌లో కల్సుకొనేవాళ్ళం. ఒక నెలరోజులపాటు కేవలం చూపుల ద్వారానే ఒకరినొకరం అర్థంచేసుకొన్నాం. చూపులద్వారా హృదయాలలో అంకురించిన ప్రేమ మరోనెలలో మాటల ద్వారా స్థిరపడిపోయింది. ఆపైన పబ్లిక్ గార్డెన్‌లోనూ, సినిమాహాళ్ళలోనూ కల్సుకుని, అరచేయిచాచినట్లుగా హృదయాలు విప్పుకొని, ఆదర్శం రూపంలో ఆచరణలో పెట్టడానికి నిర్ణయించుకొన్నాం."

"మంచిది, ఇద్దరూ ఉద్యోగులు. పైపెచ్చు ప్రేమించుకొన్నారు. పెళ్ళి చేసుకోవడానికి నిర్ణయించుకొన్నారు. ఇందులో సమస్య ఏముంది? ఏ బాలాజీ భవన్‌లోనో ముచ్చటగా మూడు ముళ్లూ వేసుకోవచ్చుగా!"

"లవ్ ఎఫెయిర్స్ అంత సులభమైతే ఈ సినిమాలకు ఎన్నిరకాల కథలు ఎట్లా దొరుకుతాయి సార్!"

"అంటే - ఏదో మతతపేచీ ఉన్నదన్నమాట! మైగాడ్! ఇద్దరిదీ కులం ఒకటికాదా?"

"ఇంతవరకూ ఆమె క్యాస్ట్‌ను గురించి అడగలేదు సార్!"

"పోనీ, నీ క్యాస్ట్‌ను గురించి ఆమె అడిగిందా?"

"లేదు సార్!"

"అయితే మీది అక్షరాలా ఆదర్శ ప్రేమే! మీది వర్ణాంతర వివాహమైతే మీకు ప్రభుత్వ ప్రోత్సాహం కూడా లభిస్తుంది. కులాలతో, కట్నాలతో కుళ్ళిపోతున్న ఈ సమాజానికి మీ వివాహం నిజంగా కనువిప్పే! ఏమంటావ్?"

"అదంతా మాకు తెలియదు సార్! ఇరువురమూ హృదయానికి హృదయంగా, ప్రాణానికిప్రాణంగా ప్రేమించుకొన్నాం. పెళ్ళిచేసుకొని జీవితాంతమూ అన్యోన్యంగా ఉండదలిచాం."

"అయితే, ఇందులో నేను చేయవల్సిన సహాయమేమిటి?"

"చాల ఉందిసార్! ఆమె తండ్రి సీతారామారావుగారని, రిటైర్డ్ స్టేషన్ మాస్టర్. అశోక్‌నగర్‌లో చిన్న ఇల్లు కట్టుకొని ఉంటున్నాడు ఆయనకుఇద్దరు కొడుకులు; ముగ్గురు కూతుళ్ళు. సునంద చిన్నకూతురు. అందరికీ పెళ్ళిళ్ళు అయినాయి. వేర్వేరు ఉద్యోగాలలో, కాపురాలతో ఉన్నారు. నా తరపున మీరు పెద్దరికాన్ని స్వీకరించి, నాలుగు మంచి మాటలు చెప్పి, ఆమెతండ్రిని పెళ్ళికి ఒప్పించాలి సార్! మీ అంతటి పెద్ద మనిషీ, ఉద్యోగపుహోదాగల వ్యక్తీ, బరువు బాధ్యతలుగల ఆయనా పెళ్ళి అడిగితే, సునంద తండ్రి ఇట్టే కూతురు పెళ్ళికి ఒప్పుకొంటాడు సార్! చిన్నతనంలోనే తల్లిదండ్రుల్ని కోల్పోయిన నాకు, మీరే పెద్దదిక్కు సార్!" అంటూ అర్థించాడు వెంకట్రావు.

ఎదురుగ్గా గోడకేసి చూస్తూ కొన్ని క్షణాలు సీరియస్‌గా ఆలోచించాడు ప్రిన్సిపాల్. చివరకు కులాసాగా చిరునవ్వును పెదవులపై రప్పించి - "అంత కంటేనా! నీ పెళ్ళి అయితే ఒహటి, మా పెద్దబ్బాయి పెళ్ళిఅయితే ఒహటా? నీ కోర్కె ప్రకారమే రాయబారం జరిపి, అమ్మాయి పెళ్ళికి ఒప్పిస్తాను. సరేనా!" అన్నాడు ప్రిన్సిపాల్.

లెక్చరర్ వెంకట్రావు గుండెలో సంతోషపు మంగళతూర్యనాదాలు మ్రోగినాయ్! ఆనందబాష్పాలు కనుకొలుకుల్లో తొంగిచూడగా, రెండు

చేతులూ నిలువుగా జోడించి, "మీ మేలు జన్మజన్మలకూ మర్చిపోను సార్" అన్నాడు.

'దానిదేముంది లేవోయ్!' అన్నట్టు తుస్కారంగా చిరునవ్వు నవ్వాడు ప్రిన్సిపాల్.

* * *

ఇది జరిగిన వారంరోజులపాటు మామూలుగా కనిపించే సునంద కనబడలేదు. వెంకట్రావు గిలగిల తన్నుకులాడాడు – గుండెలో పెద్ద క్వొశ్చన్ మార్కు పడిపోయింది. సునందకేమైనా జబ్బుచేసిందా? ఊరేమైనా వెళ్ళిందా?

ఉండబట్టలేక ఒకరోజు ఆమె పనిచేసే బ్యాంకుకు వెళ్ళి సునందను గురించి వాకబు చేశాడు. ఆమె సెలవులోవుందని సింపుల్‌గా సమాధానంవచ్చింది. ఎందుకు సెలవుపెట్టిందో ఆచూకీ తీయలేకపోయాడు. నిరుత్సాహంగా రూమ్‌కు తిరిగి వచ్చాడు.

"ఏమిటి బ్రదర్! లాస్ట్‌లెగ్‌లో జాక్‌పాట్ పోయిన నిర్భాగ్యుని మొహం పెట్టావ్?" అన్నాడు అతని మిత్రుడూ, రూమ్‌మేట్ అయిన ఆనందరావు.

ఏం మాట్లాడకుండా అద్దంలోమొహం చూసుకోసాగాడు వెంకట్రావు.

"ముంజేతికంకణానికి అద్దంకావాలా అన్నట్టు, నీ మొహంలో మునిమాపుకు వేరే అద్దం అక్కర్లేదోయ్! అసలు సంగతి చెప్పు! ఫోటో ఫినిష్‌లో తప్పిపోయిందా, లవ్‌మ్యారేజి!"

''వారంరోజుల్నుంచీ కనబడడంలేదు సునంద!" అన్నాడు వెంకట్రావు పడక కుర్చీలో కూలబడుతూ. ఇంకాప్రశ్నన్నా విప్పలేదు.

"ఏమైంది? సెలవుపెట్టిందా ఆఫీసుకు?"

''ఊఁ!"

"ఎందుకు?"

"ఏమో!''

''ఇంటికెళ్ళి సంగతీ, సందర్భాలు కనుక్కోలేకపోయినావా?"



''నేనెప్పుడూ వాళ్ళ ఇంటికెళ్ళలేదు. ఇప్పుడెళ్ళితే వాళ్ళ వాళ్ళు ఏమైనా అనుకుంటారేమో!"

''అబ్బా! ఇంత పిరికివాళ్ళు ప్రేమకు పనికిరారోయ్! అర్ధరాత్రిదాకా పుస్తకాలకు పురుగులాగా అంటిపెట్టుకొని వుండటానికీ, ఆడదాన్ని అమాంతంగా ప్రేమించడానికి ఎంతో తేడావుంది బ్రదర్! ఒకడు ట్వెంటీఫైవ్ ఆడ్స్ ఇచ్చే గుర్రంమీద వందరూపాయలు పందెం కాసే దమ్ములున్నట్టే, అన్ని పరిణామాలకూ సిద్ధపడే ప్రేమ వూబిలోకి దిగాలి. డోన్టు వర్రీ బ్రదర్! లవ్ ఎఫైర్‌ను కూడా హార్స్‌రేసంత లైట్‌గా తీసుకోవాలి. చూడు! నేను అయిదేళ్ళనుంచీ జాక్‌పాట్ టిక్కెట్లు కొంటున్నాను. ఒక్కసారీ జాక్‌పాట్ కొట్టలేదు. అయినా నీరసంతో నీరుకారిపోయానా? లేదు. ఎప్పటికప్పుడు నూతనోత్సాహం తెచ్చుకొని, అప్పో సొప్పో చేసి టిక్కెట్లు కొంటూనే ఉన్నాను. జాక్‌పాట్ తగిలిందా, తెల్లారేసరికి లక్షాధికార్ని అయిపోతాను. మన ప్రయత్నంమీద మనకే పూర్తి విశ్వాసం ఉండాలి. బైదిబై, ఒక్క పాతికవుంటే సర్దు. రేపు పండక్కు మా అత్తగారింటికి వెళ్ళిరావాలి. మా ఆవిడ్ని చూసి ఆరువారాలైంది. పాత బాకీ, కొత్తబాకీ అన్నీకలిపి – రేపు ఆదివారం వచ్చే ట్రిపుల్ ఈవెంట్ మనీతో తీర్చివేస్తాను. అప్‌సెట్ హార్సులన్నీ వస్తే ట్రిపుల్ ఈవెంట్ కూడా పది, పదిహేను వేలదాకా తగలొచ్చు,'' అన్నాడు ఆనందరావు హుషారుగా.

వెంకట్రావు కిందిపెదవి విరిచాడు– తనవద్ద పైసాకూడా లేదన్నట్టు,

కొంచెంసేపు బతిమిలాడాడుఆనందరావు. అయినా రవ్వంత చోటు పెట్టలేదు వెంకట్రావు. పైపెచ్చు విసుక్కున్నాడు.

వెంకట్రావు మనస్సు మనస్సుగాలేదు. గజిబిజి ఆలోచనలు, ఆధారంలేని అనుమానాలు క్షణక్షణానికీ అతన్ని కృంగదీస్తున్నాయి. ఆ మరునాడు ప్రిన్సిపాల్ గారి దగ్గరకు వెళ్ళి నిలబడ్డాడు. మళ్ళీ నోరుతెరచి, 'ఏమైంది' అని అడగటానికి ధైర్యం చాలలేదు. ప్రిన్సిపాల్‌గారే అన్నాడు.

"మిస్టర్ వెంకట్రావ్ ! పెళ్ళికోసం అంత ఆరాటం తగదు. మన పెద్దవాళ్ళు అన్నట్టు, కల్యాణమొచ్చినా, కక్కొచ్చినా ఆగుతుందా ? ఆ ఘడియ వస్తే ఎవ్వరూ ఆపలేరు."

ఆ మెట్ట వేదాంతంలోని ఆంతర్యం బోధపడక వెంకట్రావు మూడు గంటల సేపు మధనపడ్డాడు.


తర్వాత మూడురోజులకు వెంకట్రావుకు ఓ శుభలేక వచ్చింది. ఆ శుభలేక చూడగానే నిలువునా నీరైపోయి, నేల మీదకు జారిపోయాడు. ఆపాదమస్తకమూ స్థాణువులా అయి, కొన్ని నిముషాలపాటు మాట్లాడలేకపోయాడు.

ఎంత మోసం ? దగా - వంచన !

సునందకూ, ప్రిన్సిపాల్‌గారి అబ్బాయికీ వారంరోజుల్లో వివాహం !

ఈ వివాహానికి సునందఒప్పుకుందా? ఆమె అంగీకారంలేకుండానే ఈ వివాహం నిశ్చయమైందా ? ఏం జరిగింది ?ఇదంతా ఎవరి కుతంత్రం ? పరిస్థితులు ఇట్లా ఎందుకు మలుపు తిరిగాయి ? - అనేక ప్రశ్నలు వేడెక్కిన అతని బుర్రలో గిర్రున తిరిగినాయి.

వెంటనే కాలేజీనుంచి రూమ్‌కు వచ్చేశాడువెంకట్రావు.వస్తూవస్తూనే ఒకషాపు నుంచి బాటిల్‌లో ఎండ్రిన్ తెచ్చుకొన్నాడు. సునంద పెళ్ళిశుభలేఖ అతనికి బ్రతుకుపై విరక్తిని జనింపజేసింది. సునందను భార్యగాపొందని తనబ్రతుకు




వ్యర్థమనీ, ఆమెలేనిదే తను బ్రతకలేడనీ భావించాడు. ఆత్మహత్య చేసుకోవడానికి గాఢంగా నిశ్చయించుకున్నాడు.

రాత్రి ఏడున్నర గంటలవరకూ ఒక్కడే రూమ్‌లో కూర్చుని ఆలోచించుకొన్నాడు. ప్రతిఆలోచనలోనూ సునంద ప్రధానవస్తువై అతని మనస్సును కలవరపరచింది. అంతకంతకూ ఆత్మబలం క్షీణించసాగింది. చివరకు ఆత్మహత్య చేసుకోవడానికే నిర్ణయించుకొన్నాడు. ఆమేరకు అతనిమనోబలం ధ్రుపపడింది.

తన మరణానికి ఎవ్వరూ బాధ్యులు కారనీ, జీవితంమీద కలిగిన నిరాశా నిస్పృహలవల్లనే 'తానుఇచ్ఛికంగా'ఆత్మహత్యకు పాల్పడుతున్నాడనీ స్పష్టంగా ఒక కాగితంమీద వ్రాసి టేబుల్‌మీద పెట్టాడు. తర్వాత కొద్దిక్షణాలకే చిన్న గ్లాసులో ఎండ్రిన్ పోసుకొని, సునందను తల్చుకొంటూ రెండుగుక్కలు తాగాడు వెంకట్రావు.

కొద్ది నిముషాలకే అతని మిత్రుడు ఆనందరావు ఈలపాట పాడుకొంటూ గదిలోకి వచ్చాడు. వచ్చీరావడంతోనే నేలమీద పొరిగిపోయి గిలగిలా తన్నుకొంటూన్న వెంకట్రావును చూశాడు! ఎండ్రెన్ వాసనను పసిగట్టాడు. అసలే అతను డ్రగ్ ఇనస్పెక్టరు కొద్దిగామిగిలి ఉన్న ఎండ్రిన్ సీసాకూడా అక్కడే ఉంది. ఎమర్జన్సీ పరిస్థితిని గమనించి వెంటనే ఆటోరిక్షాలో వెంకట్రావును గవర్నమెంటుహాస్పటల్‌కు తీసుకెళ్లాడు.

వెంకట్రావు తాగిన ఎండ్రిన్‌ను డాక్టర్లు అతికష్టంమీద కక్కించారు.

తొమ్మిదిగంటలకు వెంకట్రావు కొంచెం తేరుకొన్నాడు. మాట్లాడగలిగే స్థితిలోకి వచ్చాడు. ఆనందరావు పక్కన ఉన్నాడు.

''ఎంతఎడ్వెంచరుచేశావు మిత్రమా!" అన్నాడు ఆనందరావు.

"నన్నెందుకు హాస్పటల్‌కు తీసుకొచ్చావ్ ?'' అన్నాడు వెంకట్రావు నీరసంగా.

''అది నా ధర్మం ! ఆప్తమిత్రుడు ఆత్మహత్య చేసుకొంటూంటే, కళ్ళు మూసుకొని కూర్చోమంటావా?...అయినా ఆఫ్టారాల్ ! ఈ రోజుల్లో కూడా లవ్ ఎఫైర్ ఫెయిలయితే, అంత సీరియస్‌గా తీసుకొని బంగారంలాంటి బ్రతుక్కు-

ఫుల్‌స్టాప్ పెట్టబోవటమేమిటి? నువ్వు ప్రేమలో ఇంతపిచ్చిగా పడ్డావనుకోలేదు. ఎంత పనిచేశావురా! నేను గదికిరావడం ఒక పావుగంట ఆలస్యమైతే ఈపాటికి నువ్వు శ్మశానంలో శాశ్వతంగానూ, నేను టెంపరరీగానూ ఉండాల్సివచ్చేది. బైదిబై ఆ ఎండ్రిన్ ఎక్కడ కొన్నావురా?''

షాపుపేరు చెప్పాడు వెంకట్రావు.

''నువ్వు రెస్టుతీసుకో! ఒక అర గంటలో మళ్ళీ వస్తాను. అర్జంటు పని ఉంది'' అంటూ ఆనందరావు చివుక్కున అక్కడనుంచి లేచివెళ్ళాడు.

దిగాలుపడిచూస్తూబెడ్‌మీద పడుకొని ఉన్నాడు వెంకట్రావు.

గంటతర్వాత వచ్చాడు ఆనందరావు చిరునవ్వు నవ్వుకొంటూ.

''బ్రదర్, ఈ రాత్రి నువ్వు ఇక్కడనే రెస్టుతీసుకో! రేపుపొద్దున డిస్చార్జి చేస్తారుట. నిన్ను మనరూమ్‌లో దిగవిడిచి నేను వూరెళతాను.'' అన్నాడు ఆనందరావు కులాసాగా.

''ఏవూరు?''

''మా అత్తగారింటికి. ఒకసారి మా ఆవిడ దర్శనం చేసుకురావాలి. ఎటుగూడీ వచ్చే ఆర్నెల్లలో ఇక్కడే కాపురం స్థిరపరుద్దామనుకుంటున్నాను. నేను ఇక్కడ. ఆమె అక్కడ. ఎంత కాలం ఈ విరహవేదనా వ్యవహారం.''

''అత్తగారింటి కెళ్ళటానికి డబ్బులున్నాయా?''

''ఉన్నాయ్! నీ పుణ్యాన ఇప్పుడే ఓ వంద సంపాయించాను.''

''అంటే-''

''అర్థంకాలేదా? అసలు, నీకు ఎండ్రిన్ అమ్మిన షాపువాడు నీతీ, నిజాయితీ గలవాడైతే - ఈ పాటికి నువ్వు పరలోకానికి పోయివుండేవాడివి గదా!. వాడు కాస్త గడ్డికరచి, ఎండ్రిన్‌లో కల్తీ కలపబట్టి నువ్వు బతికి బయటపడ్డావు. మన రూమ్‌లో ఉన్న ఎండ్రిన్ సీసా పట్టుకెళ్ళి, ఆ షాపువాణ్ణి నిగ్గదీసి అడిగాను. ఇందులో ఏంక ల్తీకలిపావని. వాడు తెల్లమొహం వేశాడు. కేసుపెడతానని బెదిరించాను. ఆ పళంగా వాడు వంద రూపాయల నోటు నా జేబులోపెట్టి, కాళ్ళు పట్టుకొన్నాడు. డోన్టు థింక్ అదర్‌వైజ్, బ్రదర్!- ఈ సిట్యువేషన్‌ను నా స్వార్థానికి ఉపయోగించుకొన్నానని అనుకోకు. పొద్దు ఎటుతిరిగితే, మనం కూడా అదే తిరగాలి.'' అన్నాడు ఆనందరావు లోకం పోకడ నేర్పిన చిరునవ్వును దొర్లిస్తూ.

